# రంగుల వల

రామతారకం ఇంట్లో అడుగుపెట్టడంతో ఫోన్లో కూతురు తేజూ గొంతు ఖంగుమని మోగుతోంది.

"ఐ విల్ సీ ఎవ్రీథింగ్ ఇన్ బ్లాక్ అండ్ వైట్" అని ఒక్కక్షణం ఆగి "ఓకే, బై" అంటూ ఫోన్ పెట్టేసిన ఆమె ముఖం కాస్తంత కోపంగా, సీరియస్‌గా ఉంది.

అక్కడున్న మంచం మీద నడుము వాల్చి ఓరకంట కూతుర్ని చూశాడు. అరవై ఐదేళ్ళ రామతారకం. నాణ్యమైన నల్లరాతి శిల్పంలా కనిపించిందతనికి కూతురు.

అతనికున్న ముగ్గురాడపిల్లల్లో మూడో పిల్ల తేజస్విని నల్లగా ఉండటమే కాకుండా పెద్దగా అందంగా లేకపోవడం వల్ల తండ్రిగా అతను నిరుత్సాహపడుతూ ఉంటాడు. ముప్పై ఏళ్ళు దాటినా ఇంకా పెళ్ళి కాలేదని బెంగపడుతున్నా, ఆమెలో ఉన్న ఆత్మాభిమానం, స్వతంత్ర భావాలూ, నిక్కచ్చితనం అతనికెంతో గర్వంగా సంతోషాన్ని కలిగిస్తూ ఉంటాయి.

ముగ్గురూ ఆడపిల్లలే. మగపిల్లవాడు పుట్టలేదని చిన్నతనంలో బాధగా ఉండేది. కానీ ఇద్దరు ఆడపిల్లల పెళ్ళిళ్ళై అల్లుళ్లు తమ ఇష్టప్రకారమే నడుచుకుంటూ తమకు కొడుకుల్లేరనే బాధను తొలగించారు. అదీగాక కొడుకులున్న తల్లిదండ్రులు కోడళ్ళ అనాదరణకి గురై, పడే అవమానం చూసినప్పుడు వడ్డించే కూతురు తనదైనప్పుడు అల్లుళ్ళ గురించెందుకు బాధ అని సరిపెట్టుకున్నాడు.

తను తన తల్లికి కొడుకైనా, భార్య ఇష్టపడని కారణంగా తల్లిని నాలుగు రోజులు తన దగ్గర ఉంచుకోలేకపోతున్నాడు. ఆవిధంగా జమాజెట్టీల్లాంటి ముగ్గురు కూతుళ్ళున్న తనే ధన్యుడు.

• • •

రామతారకం కారు నలుపుగా ఉంటాడు. నల్లగా ఉన్నప్పటికీ కొందరు అందంగా, దర్జాగా వుంటారు. కానీ, అతను దానికి పూర్తి విరుద్ధం. నలుపే కాకుంగా లావుగా, బండగా ఉంటాడు. చిన్నప్పటినించీ 'ఒరే నల్లాడా', 'ఒరే బండాడా' అని పంతుళ్ళు పిలవడం, పక్క పిల్లలు నవ్వడం సహజంగా జరిగిపోతూండేది. రామతారకం మనసు చిన్నబుచ్చుకుంటూనే ఉండేది. ఏమాత్రం చక్కదనం లేకపోవడానికి తగ్గట్టుగా పాత చింతకాయ పచ్చడి లాంటి పేరు అతనికీ మరీ బాధగా ఉంది. అతని తల్లి వాళ్ళ నాన్నపేరు ఇష్టంగాపెట్టుకుంది. ఆ పేరునేమైనా అంటే ఆమె ఊరుకోదు.

అయితే ఇంట్లో అందరూ నలుపే. తండ్రి కారు నలుపు. అన్నలిద్దరూ అదే రంగు. తల్లి చింతపిక్క రంగు. చెల్లెలు జీడిగింజ. ఇంట్లో తెలుపు నలుపుల సమస్య లేదు. అతనికే లోలోపల నల్లని వాళ్ళంటే ... ఒళ్ళుమంటగా ఉండేది. తన రంగెలాగూ మార్చుకోలేడు. పేరైనా మార్చుకుందామంటే అదీ కుదర్లేదు. అతని మనసులో బలంగా నాటుకుపోయిన కోరిక ఒకటుంది. అదేమంటే ఎలాగైనా తెల్లటి పిల్లని పెళ్ళి చేసుకోవాలీ అని. మధ్యతరగతి కుటుంబం. తండ్రి కామయ్య శాస్త్రి సంపాదన మీదనే గంపెడు సంసారం గడవాలి. అందుకే కొడుకుల్ని ముగ్గుర్నీ ఎస్.ఎస్.ల్.సీతో ఆపేసి ఏదో ఉద్యోగాలు చూసుకోమన్నాడాయన. పెద్దవాడు కోర్టులో టైపిస్టుగా, రెండోవాడు ఎలిమెంటరీ స్కూల్ టీచర్‌గా స్థిరపడ్డారు. పెళ్ళి చేసుకున్నారు.

మగవాడికి అందమేమిటి అనుకుందామంటే రామతారకం చదువు అంతంత మాత్రం. అతను మరీ చురుకైనవాడు కాదు. ఎస్.ఎస్.ఎల్.సీ ఒకసారి ఫెయిల్ అయి రెండోసారి ప్యాసయ్యాడు. ఆ తర్వాత ఏం చేద్దామన్నా తోచకుండా ఉన్న సమయంలో తల్లి మంగతాయారు కాళ్ళ కింద నిప్పులుపోసేయడం మొదలుపెట్టింది.

"ఏదో ఒకటి చూసుకో. కావాలంటే పరీక్షలకి ప్రైవేట్‌గా కట్టుకుందూ గానీ" అంటూ పోరు పెట్టేది.

పక్కింటి వైశంపాయనుడి గారి కూతురు తులసి చూసే చూపులకి రామతారకం గుండె ఝుల్లుమంటూ ఉండేది. చక్రాల్లాంటి కళ్ళలోని చమక్కు ఇష్టంగానే అనిపిచ్చేది.

వైశంపాయనుడు పౌరోహిత్యం చేస్తాడు. డబ్బు బాగానే వస్తుంది. ఇంట్లో సరుకూ, సామాగ్రి పుష్కలంగా ఉంటాయి. ఎప్పుడూ నగా నట్రా కొంటూనే ఉంటాడు. ముగ్గురు మగపిల్లల తర్వాత పుట్టిన తులసి అంటే ఇంట్లో ఎంతో గారాబం, అయిన వాళ్ళ అబ్బాయి దొరికితే ఇచ్చి పెళ్ళి చేసి చదువూ, సంధ్యా చెప్పించి, డబ్బూ దస్కం ఇవ్వచ్చని ఆ తండ్రి చూస్తున్నాడు.

కానీ, తులసి తెల్లటి పిల్ల కాదు. ముఖం కళగా ఉన్నా, రంగు మాత్రం విరిగిందంతే. అందుకే రామతారకం తన ఆకర్షణని పక్కకి తోసేశాడు.

తన మూడో కొడుకు విషయంలో పక్కింటాయన ఏదో ఆశపడుతున్నాడని

గ్రహించిన మంగతాయారు బహిరంగంగానే 'పౌరోహిత్యం చేసే వాళ్ళతో వియ్యమా' అంటూ ఎగతాళి చేసేసింది.

వీళ్ళ అభిప్రాయం చూచాయిగా తెలిసిన తులసి తల్లిదండ్రులు ఆ ఆలోచన విరమించుకున్నారు. అప్పట్నించీ తారకం వైపు చూడటం మానేసింది. ఆమె చూడటం మానేశాక అతని మనసు చిన్నబుచ్చుకున్నా తెల్లపిల్ల వ్యామోహం అతన్ని చిచ్చుకొట్టింది.

ఇలాంటి సమయంలో ఆ ఊళ్లో పెట్టిన బీడీల ఫ్యాక్టరీలో రామతారకానికి చిన్న గుమస్తా ఉద్యోగం వచ్చింది. ఆ కుటుంబంలో అందరూ ఎంతో ఆనందపడ్డారు. అప్పట్లో ఉద్యోగం దొరకటం అంటే సామాన్య విషయంకాదు. అందులో ఉన్న ఊళ్ళో ఉద్యోగమంటే మాటలా. రామతారకానికి గర్వంతో గుండెలు పొంగాయి.

●●●

ఆ రోజు సాయంత్రం గేటు తీసుకుని లోపలకొస్తున్న అన్నగార్ని చూసి ఆశ్చర్యపోయింది మంగతాయారు. చటుక్కున లేచి వెళ్ళింది. "రా, అన్నయ్యా" అంటూ ఆహ్వానించింది. లోపలి గదిలో ఏవో కాయితాలు చూసుకుంటున్న కామయ్య శాస్త్రి బయటికి తొంగి చూసి బావమరిదిని చూసి నమ్మలేకపోయాడు.

"రావోయి! చాన్నాళ్ళకి వచ్చావు!" అంటూ ఎదురెళ్ళాడు. వచ్చిన వెంకటేశ్వర్లు ఇద్దరి ఆహ్వానం చూసి ఆనందపడిపోయాడు. ఇది శుభ సూచకమే అనుకున్నాడు. తను వస్తే అరగంట వరకూ గదిలోంచి బయటికి వచ్చేవాడు కాదీ బావగారు. అలాంటి వాడిలోని మార్పుచూసి తృప్తిగా నువ్వుకున్నాడు. అందరూ కబుర్లలో పడ్డారు. కుశల ప్రశ్నలూ, వాకబులూ, వివరాలూ అయ్యాక వెంకటేశ్వర్లు చల్లగా చల్లకొచ్చిన ముంత బయట పెట్టాడు.

"మా కామాక్షిని మీ తారకంకి చేసుకోమని అడుగుదామని వచ్చాను".

నిజానికి వాళ్ళకీ వీళ్ళకీ అసలు పడదు. మంగతాయారుకు పెళ్ళి అయిన నాటినుంచి ఏవేవో గొడవలే. తెలియనివాళ్ళు వాళ్ళిద్దరూ అన్నా చెల్లెళ్ళంటే నమ్మరు. వీళ్ళటు వెళ్ళరు. వాళ్ళిటు రారు. ఎక్కడైనా కనిపిస్తే పొడిపొడి మాటలు, పలకరింతలు. అలాంటిదీ రోజు పిల్లనిస్తామంటూ వచ్చారంటే కామయ్యశాస్త్రి, మంగతాయారు ఆశ్చర్య పోయారు. వెంకటేశ్వర్లుకి నలుగురి ఆడపిల్లలు. ముగ్గురు మగ పిల్లలు. పెద్దపిల్ల కామాక్షి. అప్పట్లో ఆడపిల్లల్ని వదిలించుకోవడం అనే విషయం, ముఖ్యమైన చాలావిషయాలు పక్కనపెట్టేలా చేస్తుందని అర్థమౌతుంది. నిజానికి వీళ్ళకంటే స్థితిమంతుడు. పదెకరాల పొలం. రెండు ఇళ్ళు, ఒక మామిడి తోట ఉన్నాయి. అతని భార్య వెంకటలక్ష్మి మహాగడుసు.

మంగతాయారు, కామయ్యశాస్త్రి ఆలోచనలో పడ్డారు. నోరు గల వదిన గారంటే తాయారుకి ఒళ్ళు మంట. ఈ నాని ముచ్చు ఆడపడుచంటే ఆ వదినమ్మకీ మహావెగటు.

"మా వదినకి ఇష్టముండంటారా!" అంది తాయారు. " ఆ! భార్యకిష్టం లేకుండా అతనెలా వస్తాడు" అన్నాడు శాస్త్రి.

"నిజమే, నలుగురాడపిల్లల్ని సాగనంపడం మాటలా" అంటూ తర్జనభర్జన పడ్డారు. సాయంత్రం రామతారకం చెవిన వేశారు. అతను తన చెవుల్ని తనే నమ్మలేక పోయాడు. అతనికి తెలిసున్నదొకటే. అదేమంటే మామయ్య గారింట్లో అంతా తెల్లగా ఉంటారు. ఒకటిరెండుసార్లు కామాక్షిని దూరం నుంచి చూశాడు. సందేహం లేదు. తెల్లగా ఉంటుంది. 'ఈ అవకాశం వదులుకుంటే మరిరాదు' అనుకున్నాడు. పెళ్ళి చూపులు సంప్రదాయంగా జరిపించారు. మంగతాయారు అనుకుంది– "పిల్ల పచ్చహా వుంటుంది" అని. రామతారకం తన అదృష్టానికి మురిసిపోవడానికే చాల్లేదు ఎంత సమయమూ, కామాక్షి ఎర్రగా ఉంటుంది కానీ, ఏ కోశానా అందమనే మాటే అక్కడ లేదు. గీసేసిన పెండలం దుంపలా ఉంటుంది.

కళ్ళూ, ముక్కూ, నోరూ, పెదాలు అన్నీ కలిసి సొట్టలు పడిన ఇత్తడి పళ్ళెంలా ఉంటుందామె ముఖం. అయితే పిల్ల మాత్రం ఎర్రగా ఉంటుంది.

అన్నీ చకచకా జరిగిపోయాయి. పెళ్ళిల్లో చిన్నచిన్న గొడవలు జరిగినా వాళ్ళూ వీళ్ళూ చిర్రుబుర్రులాడినా రామతారకం మాత్రం తన తెల్లని పెళ్ళాన్నే చూస్తూ ఉండిపోయాడు.

మొదటిరోజు కార్యం గదిలో ఏడుస్తూ కూర్చుంది కామాక్షి. అదంతా భయంగా, సిగ్గుగా సరిపెట్టుకున్నాడు తారకం. మర్నాడు వెంకటలక్ష్మి, కూతుర్ని సొంటి పిక్కలెట్టేసి, బుగ్గలు నలిపేసి, ఏడవాల్సిన ఏడుపంతా ముందే ఏడిపించి గదిలోకి పంపింది. బుంగమూతి వేసుకుని కందిన ముఖంతో వచ్చిన కామాక్షిని అదేం పట్టించుకోకుండా అతను తెల్ల పిల్ల తమకంలో ఆమెని కౌగలించుకున్నాడు. తల్లికంటే ఈ మొగుడే నయమనిపించి కామాక్షి కళ్ళు మూసుకుంది.

ఆడపిల్లలకి ఒక ఇష్టం, ఒక సరదా, ఒక కోరిక ఉంటాయన్న సంగతే పట్టించు కోకుండా తల్లిదండ్రులు వాళ్ళఇష్టాలకీ, అవకాశాలకీ బలి పశువుల్ని చేసి వదిలించుకుని దానికి బాధ్యత తీర్చుకున్నామనే అందమైన రంగు పులిమి తృప్తిపడే అనేక మందిలో వెంకటలక్ష్మి, వెంకటేశ్వర్లూ ఒక జంట. పిల్లల మంచి చెడ్డలు మనమే చూడగలమని, ఇష్టం, అయిష్టం ఏమిటనీ, ఒక మగాడితో జీవించడానికి లైసెన్స్ సంపాయించి పెట్టి వాళ్ళని వదిలేస్తామని వాళ్ళు భావిస్తారు.

తెల్లనిపిల్లని పెళ్ళిచేస్కున్నానని పొంగిపోయిన రామతారకం తాను పాతాళానికి కూరుకుపోయానని తెలుసుకోవడానికి ఎక్కువ సమయం పట్టలేదు. తన ఇష్టానికి తెల్లపిల్లని చేసుకున్నాడు గానీ, తన నల్ల ముఖం ఆమెకిష్టమా కాదా అని ఆలోచించలేదు, తెలుసుకో లేదు. దాని ఫలితం నరకం.

తల్లిలో ఉన్న మాటకారితనం, నిస్సాటం, అహంకారం పుణికి పుచ్చుకున్న కామాక్షి

దానికి తన అయిష్టం, అసంతృప్తి జోడించి ముళ్ళకంపలా తయారయ్యింది. భర్త కనిపిస్తే చాలు రవరవ లాడిపోయేది. ఎంత మాటైనా, ఎంత మందిలోనైనా అనేసి హీనంగా చూసి మాటిమాటికీ జగడానికి దిగేది. మంగతాయారు తనదైన పద్ధతిలో దారిలో పెడతానని ముందుకొచ్చినా, తారకం పడనియ్యలేదు. ఎన్ని తిట్లు తిన్నప్పటికీ అతనికి తన తెల్ల భార్య అంటే వ్యామోహంగానే ఉండేది.

ఇద్దరాడపిల్లలు పుట్టేసరికి మరీ రేచులా తయారైంది కామాక్షి. ఆమె పొందిన దారిలేని అసంతృప్తి ఆమెని గయ్యాళిగా తయారు చేసేసింది. ఆమె ఏడ్చినప్పుడల్లా ఒక నగో నత్రో కొనిచ్చి ఊరడించేది తల్లి. "మూడో కాన్పు మగ పిల్లాడైతే నీ కాళ్ళు కడిగి నెత్తిన జల్లుకుంటారు" అని పొగడ్తమాటలు మాట్లాడేది వెంకటలక్ష్మి. మూడోసారి కూడ అమ్మాయే పుట్టే సరికి నిరుత్సాహపడ్డారు. ఇక పిల్లలు పుట్టకుండా జాగ్రత్త పడ్డారు.

ఆడపిల్ల అనగానే ఒక భూతంలా చూసి చిన్నప్పటినించీ పెళ్ళీ, పెళ్ళీ అని గోల చేస్తూ వాళ్ళని సరైన మార్గంలో ఎదగకుండా చేసేస్తున్నారు. కానీ కామాక్షి అలా చేయలేదు. వాళ్ళకి చదువే ముఖ్యం అనుకుంది. పుట్టిన ముగ్గురు పిల్లలూ సామాన్యంగా నల్లగానే ఉన్నారు కానీ కామాక్షి ఆశించినట్టుగా ఎర్రగా లేరు.

కామాక్షి అసంతృప్తి గుట్టలు గుట్టలుగా పెరిగి ఆమెని పూర్తిగా కప్పేసింది. ఇష్టం లేని మొగుడు - డబ్బు లేదు - వెనకాల ఆస్థిపాస్తుల్లేవు - అతనికా పెద్ద ఉద్యోగం లేదు - హోదా లేదు - ఇల్లు లేదా - వంటినిండా నగలు లేవు - నాలుగురకాల పట్టుచీరలు లేవు. ఇవే ఎప్పుడూ ఎత్తి చూపుతూ సాధిస్తూ రవరవలాడిపోతుంది కామాక్షి. అన్నిటికీ రామతారకం మౌనమే సమాధానం. భార్యాభర్తలు వేరు వేరు అసంతృప్తులతో ఉన్నప్పటికీ ఇద్దరికీ పిల్లలే ఎంతో ఊరటగా ఉండేవారు.

ఈ ముప్పై, నలభై సంవత్సరాల కాలంలో మన కుటుంబాలలో వచ్చిన ముఖ్యమైన మార్పు తల్లిదండ్రులకి పిల్లలకి మధ్య ఉన్న అనుబంధం అని చెప్పుకోవచ్చు. చిన్న కుటుంబాలుగా మారిన సందర్భంలో పిల్లలు తండ్రి దగ్గర పొందిన చనువు అందరి ఆలోచనల్ని మార్చింది. స్వేచ్ఛగా మాట్లాడటం - సంప్రదించటం - వాళ్ళ అభిప్రాయాలను నిర్భయంగా ప్రకటించటం పిల్లలకి సహజమైపోయింది. ఈ మార్పు మధ్య తరగతి కుటుంబాలలో గొప్ప చైతన్యం తీసుకువచ్చిందని చెప్పుకోవాలి.

రామతారకం ముగ్గురు కూతుళ్ళూ చాలాచురుకైన వాళ్ళు. పెద్దపిల్ల సరస్వతి. చాకులాంటి పిల్ల. రెండోది బాకు. మూడో పిల్ల తేజస్విని తుపాకీ గుండు. ముగ్గురూ చదువుల్లో ఫస్టు. స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, ఆత్మాభిమానంతో బాటు మంచి క్రమశిక్షణ కలవాళ్ళు. వాళ్ళకి తండ్రి మీద ఎనలేని ప్రేమ, గౌరవం. తల్లిమీద ఎప్పుడైనా కాస్త విసుగొచ్చినా ఆమెకేంకావలసినా బాధ్యతగా చూసే ఓర్పు - కమిట్‌మెంట్.

రామతారకం తన తండ్రితో ఎప్పుడూ స్వేచ్ఛగా చనువుగా మసలిన గుర్తే లేదు.

ఎప్పుడూ భయం. ఏం కావలసి వచ్చినా తల్లిద్వారా రాయబారమే. ఈరోజు తన కూతుళ్ళు తన భుజాల పట్టుకు వేళ్ళాడుతూ గారాలు పోతుంటే తను పొందుతున్న ఆనందం అప్పట్లో ఏ తండ్రీ పొంది ఉండడు అనుకుంటాడతను.

కూతుళ్ళ గురించి ఆనందించటంలో తారకం, కామాక్షి ఒక్కటే. ధైర్యంగా పిల్లలు వారి అభిప్రాయాలు చెప్తూంటే ఇద్దరికీ సంతోషమే. తాము కోల్పోయినదేదో దొరికినట్లు అనుకుంటారు.

"అవును, నేనంత ఫెయిర్ కాను! ఆ విషయం తెలుసుకునే రమ్మను! వచ్చాక పిల్ల నలుపూ, గిలుపూ అంటే మర్యాదగా ఉండదని చెప్పు" గట్టిగా భయం లేకుండా కుండబద్దలు కొట్టినట్లు చెప్పింది తేజూ.

"నాన్సెన్స్! తెల్లవాళ్ళకి తెల్లవాళ్ళే కావాలి. నల్ల వాళ్ళకి తెల్లవాళ్ళే కావాలి. నల్లగా ఉంటే అందరికీ లోకువే. ప్రతీ వాళ్ళకీ తెల్ల తోలు కావాలి."

"అమెరికా వెళ్ళిన మన వాళ్ళకి కూడా తెల్లవాళ్ళంటేనే ఇష్టంట. వాళ్ళంటేనే మోజుట. అక్కడ కూడా నల్లవాళ్ళంటే చిన్న చూపేనట. ఇదే మరి రేసిజం అంటే" గట్టిగా పైకి మాట్లాడుకుంటూ పుస్తకాలు సద్దుతోంది తేజూ.

అప్పుడే బయటనించీ వచ్చిన కామాక్షి భర్త పడుకునుండటం చూసి "ఏమిటీ పడుకున్నారు? ఉద్యోగానికి కెళ్ళే పనిలేదా?" అంది. రిటైరయ్యి నాలుగేళ్ళైనా ఇంకా ఏదో చిన్న ఉద్యోగం చేస్తూ కాలక్షేపం చేస్తున్నాడు రామతారకం.

తల్లి మాటలకి తేజూ ఆమె మీద విరుచుకుపడింది. "ఎన్నాళ్ళు చేస్తారే నాన్నగారు ఉద్యోగం? ఆ... ఎన్నాళ్ళు చేస్తారు? ఇంక చెయ్యరు. నీకేం కావాలో చెప్పు. నాకు బోలెడు జీతం కదా. నేను తెచ్చిస్తాను" అంటూ అరిచింది.

"నీ డబ్బు నీ కట్నానికి వద్దా? మీ నాన్నగారి దగ్గరేమీ లేదు ఇవ్వడానికి" అంటూ కామాక్షి అంతగాను అరిచింది. తేజూకు ఒళ్ళు మండిపోయింది.

"నువ్వు మరొక్క మాట మాట్లాడితే ఊరుకోను. లప్ప బాగా గుమ్మరిస్తే పచ్చహో ఉన్నవాడు నా కొస్తాడనేగా నీ ఆశ. నాకేం వద్దు. నాకెవ్వరు కావాలో నేను చూసుకుంటా" అంది.

కామాక్షి ఒక్కసారి తేరపారి కూతుర్ని చూసింది. 'నేనెప్పుడూ ఇంత గట్టిగా నా కిష్టం లేదు. నాకొద్దు అంటూ ఎందుకు చెప్పలేకపోయాను?' అనుకుంది మనసులో.

రామతారకం కూతుర్ని గర్వంగా చూశాడు. "తెల్లతోలు కోసం ఆశ పడి నేనెంత భంగపడ్డాను. తెల్లని వెలుగు కనిపించనంత చీకట్లో ఉండిపోయాను. ఇప్పుడు నా ఈ తేజూ తెల్లగా ధగధగమెరుస్తూ కనబడుతోంది".

అతను విశ్రాంతిగా పక్కకి ఒత్తిగిల్లి పడుకున్నాడు.